సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 28 । జూన్ । 2025



గవర్నర్ దత్తత గ్రామంలో సంబురాలు - 8లో

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తిలో గ్రామస్తులు సంబురాలు చేసుకున్నారు.



ప్రజల గుండెల్లోనే పీవీ..

చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. నేడు పీవీ 104వ జయంతి సందర్భంగా కథనం. - 8లో

గరిష్టం/కనిష్టం
34.6°/27.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ తనిఖీ



గణపురం: సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జై ప్రకాశ్‌రాయి సభ్యులతో కలిసి శుక్రవారం మండలకేంద్రంలోని రేషన్‌షాపు నంబర్ 3లో తనిఖీచేశారు. రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ అధికారి జమన్ కుమార్, భూపాలపల్లి సివిల్ సప్లయీస్ అధికారి శ్రీనాథ్, డీఎం రాములు పలు మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

రీజియన్ రక్షణ జీఎం పరిశీలన

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ 2, 3లను రామగుండం రీజియన్ రక్షణ జీఎం మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. ఏరియా జీఎం రాజేశ్వర్ రెడ్డితో మొదటగా వ్యూ పాయింట్ వద్దకు చేరుకొని ఉపరితల గని ప్లాన్‌లను పరిశీలించి ఉపరితల గనులలో జరుగుతున్న పని విధానాలు, స్థితిగతులు, యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తగు ప్రణాళికలు సిద్ధంచేసుకొని రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి నిబంధనలు పాటించాలని, ఉద్యోగులందరూ రక్షణ పరికరాలను ఉపయోగించి సమష్టిగా కృషిచేసి ఉత్పత్తి శాతాన్ని పెంచి సంస్థ మనుగడకు తోడ్పడాలని రక్షణ జీఎం కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కవీంద్ర, ఏరియా సేఫ్టీ అధికారి ప్రసాద్, అధికారులు శ్యాంసుందర్, రమాకాంత్, క్రిష్ణయ్య, భిక్షమయ్య, శ్రీనివాస్, రాజారావు పాల్గొన్నారు.

అంబులెన్స్ వాహనాల తనిఖీ



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని 108, 102, నియోనటల్ అంబులెన్స్ వాహనాలను శుక్రవారం ఉమ్మడి వరంగల్ క్లస్టర్ మేనేజర్ నసీరుద్దీన్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌లను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వచ్చిన వెంటనే వాహనం బయలుదేరాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నరేష్, టెక్నీషియన్స్, పైలెట్లు సుజాత, నరేష్, విజేందర్, రాజశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

రేగొండ: గీత కార్మికుడు తాటిచెట్టు పై నుంచి జారిపడటంతో తీవ్ర గాయాలైన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఓరుగంటి సాయిలు వృత్తిలో భాగంగా శుక్రవారం తాటి చెట్టు ఎక్కి కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద జారిపడ్డాడు. దీంతో సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో పరకాల ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మొక్కలను సిద్ధంచేయాలి

కాటారం: వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ అన్నారు. మండలకేంద్రంలోని వననర్సరీని శుక్రవారం డీఆర్‌డీఓ పరిశీలించారు. మొక్కలను జాగ్రత్తగా పెంచాలని.. ప్రతీ మొక్క ఎదిగేలా చూడాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ వెంట ఏపీఓ వెంకన్న, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీకాంత్, టీఏ మనోజ్, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

జాతీయ ఉత్తమ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 13వ తేదీ వరకు నేషనల్ అవార్డు టీచర్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు.

అక్రమాలకు చెక్..



జీపీఎస్ లొకేషన్‌తో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నేషన్ అమలు

- ప్రస్తుతం చిన్నారుల ఫొటో క్యాప్చరింగ్
- జూలై నుంచి బాలింతలు, గర్భిణులకు కూడా..
- పారదర్శకతను పెంచేలా ప్రభుత్వం చర్యలు

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకతను పెంపొందించి బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు చేపడుతుంది. కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు, ఇతరత్రా పోషకాహార పదార్థాలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యను అధిగమించి లబ్ధిదారులకు పారదర్శకంగా, సక్రమంగా చేరేలా ప్రభుత్వం కీలక చర్యలకు పూనుకుంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ సమయంలో ఫేస్ రికగ్నేషన్ విధానం తప్పనిసరి చేసింది. కేంద్ర మహిళా, శిశు, సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా ఐసీడీఎస్ అధికారులు అమలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రతిరోజు చిన్నారుల ఫొటో క్యాప్చర్ చేసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

ప్రస్తుతం చిన్నారులకు..

ఫేస్ ఈ ఫేస్ రికగ్నేషన్ విధానం ఉపయోగించి ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు అందించే బాలామృతం, గుడ్లు వంటి పోషకాహార పదార్థాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా చిన్నారి తల్లి ఫొటోను ఫేస్ రికగ్నేషన్ ద్వారా ఫొటో తీసుకొని పోషణ్ ట్రాకర్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతనే సరుకులు అందిస్తున్నారు. ఈ విధానం ద్వారా పంపిణీ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జూలై 1నుంచి అందరికీ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు జూలై 1నుంచి ఫేస్ రికగ్నేషన్ ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనికోసం ఇదివరకు అంగన్‌వాడీ టీచర్ల మొబైల్‌ఫోన్‌లో ఉన్న పోషణ్ ట్రాకర్ యాప్‌ను అప్‌డేట్ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా జూలై 1నుంచి అమలులోకి రానుంది. నూతన విధానంతో ఫేస్ రికగ్నేషన్ ద్వారా యాప్‌లో ఫొటోతో సహా నమోదు కానుండటంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం ఎలా అందుతుందో అనే వాటిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా సులువు కానుంది.

జిల్లాలో వివరాలు..

మండలాలు	12
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	2 (భూపాలపల్లి, మహదేవపూర్)
అంగన్‌వాడీ కేంద్రాలు	643
చిన్నారుల సంఖ్య	10,364

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లలోపు చిన్నారులకు గుడ్లు, బాలామృతం, ఇతర పోషకాహార పదార్థాలు ఇచ్చే ముందు ఫేస్ రికగ్నేషన్ ద్వారా నమోదు చేస్తున్నాం. జూలై నుంచి పౌష్టికాహారం తీసుకునే ప్రతి ఒక్కరి ఫేస్ రికగ్నేషన్ నమోదు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో కొంతమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

\- రాధిక, సీడీపీఓ, మహదేవపూర్ ప్రాజెక్టు

ఇంటర్‌నెట్ సమస్యతో ఇబ్బందులు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నేషన్ ద్వారా పౌష్టికాహార పంపిణీ మంచి నిర్ణయం అయినప్పటికీ పలు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారం ఇచ్చే ముందు తీసుకున్న ఫేస్ రికగ్నేషన్ ఫొటో క్యాప్చర్‌ను యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. దీనికి ఇంటర్‌నెట్ అవసరం తప్పనిసరి. జిల్లాలో కొన్ని గ్రామాల్లో ఇంటర్‌నెట్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికి పలు గ్రామాలకు మొబైల్ నెట్‌వర్క్ సైతం అందడం లేదు, అలాంటి ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నేషన్ అంగన్‌వాడీ టీచర్లకు సవాలుగా మారనుంది. ఈ సమస్యలను అధిగమించడానికి సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

టెంట్‌సిటీ చోరీ కేసులో జాప్యం

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15నుంచి 26వరకు సరస్వతీనది పుష్కరాలు ఘనంగా జరిగాయి. వీవీఐపీలు, భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన ఆలీ ఎలిమెంట్ అనే ప్రైవేట్ సంస్థ 40వరకు టెంట్ సిటీలను తాత్కాలికంగా ఏర్పాటు చేసింది. అందులో ఏసీలు, బెడ్స్, ఫర్నిచర్, కూలర్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసింది. 12రోజుల పాటు అత్యంత ఆకర్షణగా నిలిచింది. మే 26న పుష్కరాలు ముగియడంతో రెండు రోజుల తరువాత టెంట్‌సిటీలో దొంగలు పడి ఎనిమిది ఏసీ కంప్రెషర్లు, కూలర్లు, ఇతర ఫర్నిచర్లు దొంగిలించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టెంట్ సిటీలో దొంగిలించిన సామగ్రిని రికవరీ చేయడంతో పాటు దొంగలను గుర్తించడంతో పోలీసులు శ్రద్ధ చూపడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే గతంలో కాళేశ్వరంలో పలువురి దుకాణాలు, ఇళ్లలో చోరీ జరిగి సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఛేదించడంతో తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం పుష్కరాలు ముగిసి నెల రోజులు అవుతున్నా కేసులో పురోగతి సాధించకపోవడంతో గ్రామంలో చర్చ జరుగుతుంది. ఇప్పటికే గ్రామంలో పలువురు అనుమానితుల వివరాలను పోలీసులు సేకరించి, విచారణ జరుపుతున్నారని తెలిసింది. కాళేశ్వరంతో పాటు మహదేవపూర్, కాటారం, భూపాలపల్లికి చెందిన వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై తమాషారెడ్డిని సంప్రదించగా.. టవర్ డంప్ చేశామని, సీడీఆర్ ఇచ్చామని, సీసీఎస్ పోలీసులు తేల్చాల్సి ఉందని తెలిపారు.

అక్రమ అరెస్ట్ అమానుషం



పోలీసుల అదుపులో యూనియన్ నాయకులు

కాటారం: గ్రామపంచాయతీ కారోబార్లు, వర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేయడం అమానుషమని తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ దోమల శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు కారోబార్లు, సిబ్బంది వెళ్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పలువురు కారోబార్లు, సిబ్బందిని గురువారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. తమ యూనియన్ నుంచి ముట్టడికి పిలుపునివ్వలేదని మరో యూనియన్ తలపెట్టిన ధర్నాకు తమకు సంబంధం లేదన్నారు. పోలీసులకు వివరించినప్పటికీ వినిపించుకోలేదని రాత్రి నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచారని ఆరోపించారు. పోలీసులు వివరాలు తెలుసుకోకుండా అక్రమ నిర్బంధం చేయడం బాధాకరమని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మెండ మల్లికార్జున్‌రావు, చిట్యాల శశికుమార్, బొర్లకుంట రవి, ఆత్కూరి రవి, కొండయ్య ఉన్నారు.

చారిత్రక ప్రాధాన్యతను తెలుసుకోవాలి



ఏర్పాటుచేసిన బోర్డు వద్ద శాస్త్రవేత్తలు

రేగొండ: రాష్ట్రంలోని ఏకైక జియో హెరిటేజ్ ప్రదేశంగా ఉన్న పాండవుల గుట్టలను సందర్శించి దాని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రాధాన్యతను తెలుసుకోవాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మంజు అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులోని పాండవుల గుట్టలను సందర్శించి గుట్ట నిర్మాణ ప్రాముఖ్యతను, వయస్సు, పురాతన శిలా చిత్రాలు వంటి అంశాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన జియో హెరిటేజ్ ఇన్ఫర్మేషన్ ప్యానెల్ బోర్డును డాక్టర్ మంజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార బోర్డులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే పాండవుల గుట్టలో కనిపించే భౌగోళిక లక్షణాలు, ప్యాలియోలిథిక్ జీవన చరిత్ర ఆధారాలను సందర్శకులు అర్థం చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్ సామల, గుండా రమేష్, తుషార్ చంద్రపటేల్, అశోక్ కుమార్ కలబతులా హాజరయ్యారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న కొరిమి సుగుణ

భూపాలపల్లి అర్బన్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో మహిళలపై అనేక అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచార దాడులను అరికట్టేందుకు దేశంలో నూతన చట్టాలు తీసుకురావాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించి మహిళలు రాజకీయాల్లో రాణించే విధంగా అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు గోలి లావణ్య, పెద్దమామల సంధ్య, క్యాతరాజు అనూష, పల్లెల రజిత, గడ్డం స్వరూప, కటకోళ్ల భారతి, ఇటుకల శ్రీలత పాల్గొన్నారు.

కపాలినీ, భగమాలినీ క్రమాల్లో భద్రకాళి అమ్మవారు



కపాలినీ అలంకరణలో..

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి కపాలినీ, భగమాలినీ క్రమాలలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఉదయం 4 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, చతుఃస్థానార్చన తదితర పూజలు నిర్వహించారు. దశమహావిద్యల్లోని కాళీక్రమాన్ని అనుసరించి స్నపనబేరాన్ని కపాలినిగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగబేరాన్ని భగమాలినిగా అలంకరించి నవరాత్ర విశేష పూజలు జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు జరుపుకున్నారు. సినీ నటులు కొణిదెల నాగబాబు సతీమణి పద్మజ అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



బెంచీలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన 600 డెస్క్ బెంచీలను కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మంత్రి పంపిణీ చేశారు. పాఠశాలలో లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్కులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులను సంక్రాంతి, దసరా సెలవుల్లో హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాలకు తీసుకెళ్లే కార్యక్రమం చేపడుతామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య, హాజరుశాతం పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఈఓ రాజేందర్, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం దిశగా చర్యలు..

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా అధిష్టానం చర్యలు తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండలకేంద్రంలో మండల సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ట్రేడ్ ప్రమోషన్ కమిషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిశీలకులు లింగాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయని వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం మెరుగు

మల్హర్: గ్రామీణ ప్రాంతం నుంచి జిల్లా కేంద్రానికి రవాణా వ్యవస్థను మెరుగుపరిచి, మండల ప్రజలకు జిల్లా కేంద్రాన్ని మరింత దూరభారం తగ్గిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతం నుంచి భూపాలపల్లి వన్ ఇంక్లయిన్ మైన్ వరకు రూ. 4.70 కోట్లతో నిర్మించే రోడ్డును శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు భూమి పూజ నిర్వహించారు. తాడిచర్ల పాత గ్రామ పంచాయతీలో చిల్డ్రన్ పార్కును శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిచర్ల 132/33కేవీలైన్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొయ్యూరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే తీసుకువస్తామని వివరించారు. పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్‌కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తాడిచర్లలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, అయిత రాజిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ పాల్గొన్నారు.

పరిశీలిస్తూ.. ప్రశ్నిస్తూ

- ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులతో ఆస్పత్రులను సందర్శించిన పర్యవేక్షణ కమిటీ
- కేఎంసీ, ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్ ఆస్పత్రుల తనిఖీ
- సమస్యలను రాతపూర్వకంగా ప్రభుత్వానికి పంపించండి..
- పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ
- ఎంజీఎంలో ఫార్మసీ సూపర్‌వైజర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌తో మాట్లాడుతున్న సంగీత



ఎంజీఎం ఓపీ కౌంటర్‌లో చీటీ తీసుకున్న మహిళతో మాట్లాడుతున్న సంగీత



కేఎంసీలో వివిధ విభాగాల వైద్యులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత, చిత్రంలో కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, వైద్యాధికారులు

ఎంజీఎం : నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎంసీ) మెడికల్ కాలేజీల్లో వసతులపై జారీ చేసిన షోకాజ్ నోటీసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణ కమిటీ శుక్రవారం నగరంలోని కేఎంసీ, ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. పర్యవేక్షణ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ.. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారదతో కలిసి ముందుగా కాకతీయ మెడికల్ కళాశాల(కేఎంసీ)ను సందర్శించారు. బోధన సిబ్బంది, పరికరాల లేమిపై ఆయా విభాగాధిపతులతో సమీక్షించారు. కేఎంసీలో హెమటాలజీ విభాగాన్ని, వైద్యవిద్యార్థుల వసతి గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాలను, ప్రస్తుతం ఉన్న వైద్య అధ్యాపకుల పోస్టుల ఖాళీలు, మౌలిక వసతులపై ప్రభుత్వానికి నివేదించేందుకు పలు అంశాలపై చర్చించారు.

పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రి పరిశీలన..

కేఎంసీ ప్రాంగణంలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డయాలసిస్ యూనిట్‌తోపాటు ఆపరేషన్ థియేటర్, యూరాలజీ విభాగాన్ని తనిఖీ చేశారు. పలు అంశాలపై ఆయా విభాగాల వైద్యులతో మాట్లాడి సమస్యలు వివరిస్తున్న క్రమంలో వసతుల లేమిపై ప్రభుత్వానికి రాత పూర్వకంగా నివేదించాలని ఆదేశించారు. పరికరాల మరమ్మతులో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. చిన్న చిన్న సమస్యలతో రోగులకు సేవలు నిలిపివేయకుండా చూడాలన్నారు. అనంతరం కేయూ జంక్షన్‌లోని క్షయ ఆస్పత్రిని సందర్శించి రోగులు, ఓపీ సేవల గురించి ఆరా తీశారు. మెడికల్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంజీఎంలో ఫార్మసీ సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశాలు

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఎంజీఎం ఆస్పత్రిని సాయంత్రం కమిషనర్ డాక్టర్ సంగీతసత్యనారాయణ సందర్శించారు. మొదట ఓపీ విభాగాన్ని పరిశీలించి కౌంటర్లు పెంచాలని ఆదేశించారు. ఫార్మసీ విభాగంలో ఈ–ఔషధి నమోదులో వివరాలు చెప్పడంలో విఫలమైన ఫార్మసీ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రోగులకు అందించే భోజనశాల, పిల్లల విభాగాన్ని పరిశీలించి ఆరోగ్య మహిళ పథకం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా సీకేఎం ఆస్పత్రిని సందర్శించి ఆయా వార్డులు, ఓపీ సేవలు, రెఫరల్స్, ఫాలోఅప్ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్ఓలు అప్పయ్య, సాంబశివరావు, ఆర్ఈహెచ్ సూపరింటెండెంట్ భరత్, సీకేఎం ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

హాజరుశాతంపై చర్యలు తప్పవు..

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వైద్యుల హాజరుశాతాన్ని ఫేస్ బయోమెట్రిక్‌తో చేపట్టాలని కమిషనర్.. వైద్యారోగ్యశాఖాధికారులకు స్పష్టం చేశారు. దీనిపై ఎంజీఎం సూపరింటెండెంట్ స్పందించి అలాంటి హాజరుశాతం ఎంజీఎంలో మొదలు కాలేదని సాంకేతిక కారణాలు చెప్పగా, బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని ఆదేశించారు. భవిష్యత్‌లో వైద్యుల హాజరుశాతంపై బయోమెట్రిక్ ఆధారంగా చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు.

క్లుప్తంగా

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు, సర్దుబాట్లు జరిగాయి. ఈ మేరకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ సీజీఎం వంటేరు తిరుపతి రెడ్డి డైరెక్టర్‌గా నియామకం కావడంతో ఖాళీ అయిన స్థానంలో సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా కొనసాగుతున్న ఆర్.చరణ్‌దాస్‌ను పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో నియమించారు. సిరిసిల్ల సెస్‌కు ఫారిన్ డిప్యూటేషన్‌పై వెళ్లిన పి.విజేందర్ రెడ్డి అక్కడి నుంచి సెలవుపై వెళ్లి తిరిగి ఎన్పీడీసీఎల్‌లో విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఆయనను మహబూబాబాద్ ఎస్ఈగా నియమించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శన్‌ను నిర్మల్ నుంచి జగిత్యాలకు బదిలీ చేశారు. ఎస్ఈ వి.గంగాధర్‌ను మంచిర్యాల నుంచి పెద్దపల్లికి, జీఎం వి.వేణుమాదవ్‌ను కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు నుంచి జీఎం ప్లానింగ్‌కు బదిలీ చేశారు. కార్పొరేట్ ఆఫీస్‌లో ఆపరేషన్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న ఉత్తమ్.. మంచిర్యాల ఎస్ఈగా, జగిత్యాల ఎస్ఈ సాలియా నిర్మల్ ఎస్ఈగా బదిలీ అయ్యారు. తొర్రూరు డీఈ జి.మదుసూధన్‌ను మెట్‌పల్లికి, కార్పొరేటర్ ఆఫీస్ డీఈ జి.ఎల్.మర్రెడ్డిని అదే ఆఫీస్‌లో ప్రాజెక్టు విభాగానికి, డీఈ మహబూబాద్ బి.పెద్దిరాజంను వరంగల్ డీపీఈ డీఈగా, పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయంలో డీఈ టెక్నికల్‌ను తొర్రూరు డీఈగా, కార్పొరేట్ ఆఫీస్‌లో ప్రాజెక్టు డీఈ డి.నందరాథోడ్‌ను ప్రాజెక్టు నుంచి ఇంజనీరింగ్ డీఈగా బదిలీ చేశారు. కాపులకనపర్తి ఏడీఈ నరసింహారావును కార్పొరేట్ ఆఫీస్ ప్రాజెక్టు విభాగానికి, ఏడీఈ బి.రవిని ప్రాజెక్టు నుంచి కాపుల కనపర్తికి, ఏడీఈ బి.శ్రీనివాస్ యాదవ్‌ను భూపాలపల్లి క్వాలిటీ కంట్రోల్ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు, ఏడీఈ కె.పవన్ కుమార్‌ను కార్పొరేట్ ఆఫీస్ నుంచి హెచ్‌టీ మీటర్స్ వరంగల్ సర్కిల్‌కు బదిలీ జరిగింది. అకౌంట్స్ జనరల్ మేనేజర్ ఎస్.దేవేందర్‌కు సీజీఆర్ఎఫ్ వరంగల్ ఫైనాన్స్ మెంబర్‌గా స్థానం చలనం కలిగింది. రెవెన్యూ జీఎం ఆర్.కృష్ణ మోహన్‌ను ఫైనాన్స్ జీఎంగా, ఆడిట్ జీఎం ఎస్.సత్యనారాయణను రెవెన్యూ జీఎంగా, ఫైనాన్స్ జీఎం వి.వేణు బాబును ఆడిట్ జీఎంగా బదిలీ చేశారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



మామునూరు: ఖిలావరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) పథకాల ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధన్నపేట మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన 35 మంది మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ రాజన్న హాజరై మాట్లాడారు. చిన్నపాటి వ్యవసాయ పనిముట్లు మహిళలకు కలిగే శ్రమను తగ్గించి పొలాల్లో కలుపు నివారణ పనులు సులభతరం చేస్తాయని తెలిపారు. కూరగాయల విత్తన కిట్లను ఇంటి ప్రాంగణంలో లేదా కంచెల వెంట నాటడం ద్వారా ఆహార భద్రత మెరుగు పడి గ్రామీణ మహిళల జీవనోపాధి స్థిరత్వానికి తోడ్పడుతుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఆషాఢం వేడుకల వేళ..

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు
- అమ్మవార్లకు మొక్కుల చెల్లింపులకు సిద్ధం
- తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు ప్రత్యేకం
- గురువారం ప్రారంభమైన మాసం





హన్మకొండ కల్చరల్: ఆషాఢం వేడుకలకు సమయం ఆసన్నమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలకరి వానలు పలకరించాయి. ఫలితంగా పంటల సాగుతో పాటే గ్రామ దేవతల (బోనాలు)కు పూజలు మొదలు కానున్నాయి. ఆషాఢ మాసం గురువారం ప్రారంభమైంది. ఇదే సమయంలో గ్రామాల్లో అమ్మవారిని కొలిచేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. మహిళలు కలిసికట్టుగా బయలుదేరి మొక్కులు చెల్లించనున్నారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలిఏకాదశి నాడు బీరన్న బోనాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో ప్రతీరోజు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కొందరికి గ్రామదేవతలకు బోనాలు సమర్పించే సంప్రదాయం కూడా ఉంది. ఇలవేల్పులైన అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తారు.

ఆలయాల్లో ఉత్సవాలు..

ఆషాఢ మాస శుద్ధ ఏకాదశి రోజున విష్ణువు యోగా నిద్రలోకి వెళ్లిన రోజుగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదే సమయంలో పూరి జగన్నాథ రథయాత్ర, గురుపౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా వేడుకగా జరుపుకోనున్నారు. అలాగే, వరంగల్ జిల్లాలో శ్రీభద్రకాళి అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం.

గోరంటాకు మురిపెం.. ఆరోగ్యదాయకం

వర్షకాలం ప్రారంభమై బావులు, వాగులు, చెరువుల్లోకి కొత్త నీరొస్తుంది. ఇది చర్మవ్యాధులు వ్యాప్తి చెందే కాలం. వీటి బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు గోరింటాకు ఔషధంగా పని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకును (మెహందీ) అలంకరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఆయుర్వేద వైద్య నిపుణులు గోరింటాకు చర్మ వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుందని, శరీరంలో వేడి తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం.. ఆనందం

హిందూ సనాతన ధర్మంలో ఆరోగ్యం, ఆనందం కోసం కొన్ని పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. ఇందులో కుంకుమ, తిలకం అద్దుకోవడం, విభూదిధారణ, గంధ ధారణ, కాటుక, గోరింటాకు పెట్టుకోవడం లాంటి పద్ధతులు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, అలాగే శరీరం కళకళలాడుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.



వనభోజనాల సందడి..

ఆషాఢ మాసంలో వనభోజనాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. ప్రధానంగా గ్రామాల్లోని వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు వెల్లివిరియాలని కోరుకుంటారు. గ్రామదేవతలకు పూజలు నిర్వహించి ప్రకృతి ఒడిలో పచ్చని పంట పొలాల మధ్య చెట్ల కింద సామూహిక వనభోజన సంబురాలు జరుపుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో సైతం ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపుతున్న మహిళలు

హసన్‌పర్తి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని 55వ డివిజన్ సత్యసాయి కాలనీలో అతివలు అరచేతిలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో తుమ్మ వనమాల, ఎర్రబెల్లి సుజాత, చెరుకు కృష్ణవేణి, చిట్టిరెడ్డి మంగ పూల్లారి సరోజన, లావణ్య, చింత జ్యోతి, తుమ్మ ప్రియాంక, తుమ్మ పద్మ నిహాసి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సర్కారు కృషి

- అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



దివ్యాంగులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి అందజేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించగా, మొదటి విడతలో 54 మందికి వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, సాధారణ ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్‌లు వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అతి త్వరలో నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుపేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి ఒకొక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. అనంతరం మహదేవ్‌పూర్ మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు సుమారు రూ.90 లక్షల విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.20 లక్షలతో నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ చిల్డ్రన్ పార్క్‌ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపీఓ రాధిక, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు రామచందర్‌రావు, నాగార్జునరావు, ఎస్సైలు పవన్, తమాషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ దత్తత గ్రామంలో సంబురాలు

- కొండపర్తిలో గవర్నర్, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తిలో గ్రామస్తులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. కొండపర్తిలో ఇప్పటికే చాలా మేరకు అభివృద్ధి పనులు చేశారు. గ్రామంలోని ఆదివాసీలను వ్యవసాయం రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అభివృద్ధి పనులతోపాటు 45 ఇళ్లు మంజూరు చేశారు. 7 వ్యవసాయ బోరుబావుల నిర్మాణంతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, మిర్చి పౌడర్ తయారీ పనులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చుపటేల్ మాట్లాడుతూ మంత్రి సీతక్క సూచన మేరకు గవర్నర్.. కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కొండపర్తి అభివృద్ధికి కృషి చేస్తున్న గవర్నర్, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇర్ప సీతారాములు, కల్తి రమేశ్, ఇర్ప రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు



సీఎండీ వరుణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన డైరెక్టర్లు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఫైనాన్స్ డైరెక్టర్‌గా వంటెరు తిరుపతి రెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.మధుసూదన్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా వంగూరు మోహన్ రావు, హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్ డైరెక్టర్‌గా సి.ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించగా.. సీఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి కృషితో కంపెనీని అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. సీఎండీ వరుణ్ రెడ్డి సారథ్యంలో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములవుతామని, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్లను అసోషియేషన్లు, యూనియన్ల నాయకులు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వివస్త్రను చేసి.. జననాంగంలో జీడిపోసి..



వివాహితపై దాడి
- వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతోనే..
- ఘటన జరిగి ఐదు రోజులు
- తాటికాయల గ్రామంలో అమానవీయం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల క్రితం ఓ అమానవీయ ఘటన జరిగింది. ఓ వివాహితను వివస్త్ర చేసి జననాంగంలో జీడిపోసి విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడికి వివాహేతర సంబంధం కారణం కాగా, బాధిత మహిళ ఆచూకీ ఇప్పటివరకు బంధువులకు లభించలేదని సమాచారం. ఈఘటనకు సంబంధించి 'సాక్షి'కి అందిన ఎక్స్‌క్లూజివ్ సమాచారం మేరకు.. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. అతడికి సమీప బంధువైన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ మహిళతో కలిసి సుమారు పది రోజుల క్రితం ఎటో వెళ్లిపోయారు. దీంతో సదరు వ్యక్తి భార్య తనకు జరిగిన అన్యాయాన్ని స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు కోపంతో రగిలిపోయి లేచిపోయిన ఆ ఇద్దరిని వెతికి ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకొచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికి గుండు గీయించారు. ఆ మహిళను ఓ మంచానికి కట్టేసి వివస్త్రను చేసి.. జననాంగంపై జీడీ (పూర్వకాలంలో నొప్పి తగ్గించేందుకు వాడేవారు, అదేవిధంగా శరీరంలోని సున్నిత అవయవాలపై పోస్తే పుండ్లు అవుతాయి) పోశారు. 'తప్పు చేశాను.. క్షమించండి' అని బాధిత మహిళ వేడుకున్నా.. పలువురు ఇష్టారీతిన దాడి చేశారు. యోనిలోంచి తీవ్ర రక్తస్రావమవుతున్నా వదల్లేదు. తర్వాత ఆఇద్దరిని ఏం చేశారో ఆచూకీ తెలియలేదు. ఈ అమానవీయ ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసులకు సమాచారం అందలేదని తెలిసింది. అసలు ఆ ఇద్దరు ప్రాణాలతో ఉన్నారో, లేదో తెలియని పరిస్థితి.

పలు రైళ్లు రద్దు, దూరం తగ్గింపు, రీషెడ్యూల్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో ఆపరేషనల్ రీసన్స్‌తో శుక్రవారం పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్, పార్షల్లీ రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

రద్దయిన రైళ్లు

శుక్రవారం బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (67772) పుష్‌పుల్, సిర్పూర్‌టౌన్– కరీంనగర్ (67771) పుష్‌పుల్‌లను రద్దు చేశారు.

దూరం కుదించిన రైళ్లు


భద్రాచలం–బల్లార్షా (17033) సింగరేణి, కాజీపేట–సిర్‌పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, సిర్పూర్‌టౌన్–భద్రాచలం (17034) సింగరేణి, హైదరబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్(17012) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (12757) ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూర్ (17202) ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించినట్లు తెలిపారు.

రీ షెడ్యూల్

సికింద్రాబాద్–నాగపూర్ (20102) ఎక్స్‌ప్రెస్‌ను 3 గంటలు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల గుండెల్లోనే పీవీ..

కళ తప్పిన వంగర గ్రామం
- నేడు పీవీ నర్సింహారావు జయంతి
- వంగరలో తుదిదశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు



ఎల్కతుర్తి: అభివృద్ధి లేమి.. అప్పుల ఊబిలో కూనరిల్లుతున్న తరుణంలో అన్నీ తానై ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిబాట పట్టించారు.. నాటి ప్రధాని పీవీ నర్సింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలంలోని వంగర అనే ఒక చిన్న గ్రామం నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప మేధావి పీవీ నర్సింహారావు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగర గ్రామం ఓ వెలుగు వెలిగింది. ఆ సమయంలోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నేడు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతి.

భీమదేవరపల్లి మండలం వంగరలో 1921 జూన్ 28న పీవీ జన్మించారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా పదవులకు వన్నెతెచ్చారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో వంగరలో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ మంజూరైంది. రక్షిత తాగునీటి బావి, పీవీ మోడల్ కాలనీ, బాలికల గురుకుల పాఠశాల, 24 గంటలు పనిచేసే ఆస్పత్రి, సబ్‌స్టేషన్ మంజూరయ్యాయి. ఓ వైపు దేశం, మరో వైపు కాంగ్రెస్ పార్టీ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో పీవీ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని తలెత్తుకునేలా చేయడంతోపాటు భారత ఖ్యాతిని దేశ విదేశాల్లో ఇనుమడింపజేసిన ఘనత పీవీదే. కాగా, 2004 డిసెంబర్ 23న పీవీ తుదిశ్వాస విడిచారు. పీవీ మరణానంతరం ఆయనను సొంతపార్టీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. పీవీ నర్సింహారావు ఇంటిని మ్యూజియంగా మారుస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయింది. పీవీ సొంతగ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయకపోవడంతో చివరకు గ్రామస్తులే చందాలు వసూలు చేసుకొని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం

నెరవేరని హామీలు..

హనుమకొండ– సిద్దిపేట రహదారిలో వంగర క్రాస్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో స్వాగత తోరణం, పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు లైన్ల రహదారి నిర్మించి, సెంట్రల్ లైటింగ్ తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ, నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి వంగరలో అభివృద్ధి పనుల వేగం పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుది దశలో పీవీ విజ్ఞాన కేంద్రం పనులు

వంగర గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్ రూ.11 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. పీవీ విజ్ఞాన వేదిక పార్కు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. పీవీ విజ్ఞాన వేదికలో ప్రవేశ ద్వారం, ఫుడ్‌కోర్టు, ఫొటో గ్యాలరీ, పీవీ జీవిత విశేషాలకు సంబంధించిన చిత్రాలు ఉండేలా రూపకల్పన చేశారు. దీంతోపాటు ధ్యాన మందిరం, సైన్స్ మ్యూజియం, అంఫీ థియేటర్, వాటర్ ఫౌంటేషన్, చారిత్రక శిల్పాలు, పార్క్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. పీవీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, అప్పటి నాయకులు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి పొన్నం ప్రభాకర్.. పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణం పనులను వేగవంతం చేశారు. దీంతో నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

హక్కుల పరిరక్షణలో ఓంకార్ పాత్ర ఎనలేనిది

- మోదీ పాలన దేశానికే ప్రమాదకరం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు




సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

వరంగల్ చౌరస్తా: పౌర హక్కులు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే ఓంకార్ చేసిన ఉద్యమాలు, త్యాగాలు ఎనలేనివని పలువురు వక్తలు తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల్లో భాగంగా పౌర హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెదారపు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, న్యూ డెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, నాయకులు నున్నా అప్పరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు సోమ రామమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నాయకులను అక్రమంగా జైలులో పెడుతుందని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నాని అన్నారు. అడవిలోని ఆదివాసీలను కాల్చి చంపుతూ.. అటవీ సంపద కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్, కుసుంబ బాబురావు, జగదీశ్వర్, నలిగంటి చంద్రమౌళి, రాజన్న, అనిత, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి సమన్వయంతో పనిచేయాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



కమిటీల బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: జూలై 7న నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి ఆయా కమిటీల కన్వీనర్లు, మెంబర్లను కోరారు. ఇప్పటికే స్నాతకోత్సవం నిర్వహణకు ఐదుగురు ప్రొఫెసర్లతో కూడిన స్టీరింగ్ కమిటీ, 10 సబ్ కమిటీలను కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం నియమించారు. అన్ని కమిటీల కన్వీనర్లతో శుక్రవారం క్యాంపస్‌లోని అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం స్టీరింగ్ కమిటీ మెంబర్ కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ.. ఇప్పటికే 331 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 374 మంది విద్యార్థులకు 564 బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన విషయాలను ఆయన వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఆచార్య మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రొఫెసర్ మనోహర్, ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, అమరవేణి, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, ప్రొఫెసర్ షమిత, ప్రొఫెసర్‌వై వెంకయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలి

- డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్

హన్మకొండ: పర్యాటకులు ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్ అన్నారు. ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో బొగత జలపాతానికి బయల్దేరిన రెండు ఆర్టీసీ బస్సులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాగార్జునసాగర్, బొగత జలపాతం, శ్రీశైలం, పాండవుల గుట్టలు, కాళేశ్వరం దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, వేములవాడ, కొండగట్టు, కానిపాకం, అరుణాచలం, జోగులాంబ ప్రదేశాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఈ టూర్‌కు సమకూరుస్తున్నామన్నారు. 30 మంది ఉంటే బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89777 81103, 94938 82464, 95730 90136 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్, ఉద్యోగులు, పర్యాటకులు పాల్గొన్నారు.